## అధ్యాయము 7

# జలప్రళయము యొక్క ఆగమనము

నోవహు యొక్క విమోచన మరియు లోకము యొక్క తీర్పును గూర్చిన చరిత్ర 7వ అధ్యాయములో కొనసాగించబడింది. 6వ అధ్యాయము “దేవుడు అతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తు” నోవహు చేసెను అనే అనుకూల వాక్యముతో ముగుస్తుంది (6:22). ఒకసారి ఓడ నిర్మాణము ముగిసిన తరువాత, రాబోవు జలప్రళయమును తప్పించుకొనుటకుగాను (7:11–16) దేవుడు నోవహును ఓడలోనికి ప్రవేశించమని చెప్పాడు (7:1–10). జలప్రళయము యొక్క నీరు భూమిని నింపి నేలపైనున్న జీవరాశి అంతటిని తుడిచివేసాయి; ఆ ఓడలో ఆశ్రయము పొందిన వారు మాత్రమే బ్రతకగలిగారు (7:17–24).

### ఓడలో ప్రవేశించుట కొరకైన దేవుని ఆజ్ఞ (7:1–10)

**1యెహోవా–ఈ తరమువారిలో నీవే నా యెదుట నీతి మంతుడవై యుండుట
చూచితిని గనుక నీవును నీ యింటి వారును ఓడలో ప్రవేశించుడి. 2పవిత్ర
జంతువులలో ప్రతి జాతి పోతులు ఏడును పెంటులు ఏడును, పవిత్రములు కాని
జంతువులలో ప్రతి జాతి పోతును పెంటియు రెండును 3ఆకాశ పక్షులలో ప్రతి జాతి
మగవి యేడును ఆడువి యేడును, నీవు భూమి అంతటిమీద సంతతిని జీవముతో
కాపాడునట్లు నీయొద్ద ఉంచుకొనుము; 4ఎందుకనగా ఇంకను ఏడు దినములకు
నేను నలుబది పగళ్లును నలుబది రాత్రులును భూమిమీద వర్షము కురిపించి, నేను
చేసిన సమస్త జీవరాసులను భూమిమీద ఉండకుండ తుడిచివేయుదునని
నోవహుతో చెప్పెను. 5తనకు యెహోవా ఆజ్ఞాపించిన ప్రకారము నోవహు యావత్తు
చేసెను.**

**6ఆ జలప్రవాహము భూమిమీదికి వచ్చినప్పుడు నోవహు ఆరువందల
యేండ్లవాడు. 7అప్పుడు నోవహును అతనితోకూడ అతని కుమారులును అతని**

**భార్యయు అతని కోడండ్రును ఆ ప్రవాహజలములను తప్పించుకొనుటకై ఆ ఓడలో ప్రవేశించిరి. [8]దేవుడు నోవహునకు ఆజ్ఞాపించిన ప్రకారము పవిత్ర జంతువులలోను అపవిత్ర జంతువులలోను, పక్షులలోను నేలను ప్రాకు వాటన్నిటిలోను, [9]మగది ఆడుది జతజతలుగా ఓడలోనున్న నోవహు నొద్దకు చేరెను. [10]ఏడు దినములైన తరువాత ఆ ప్రవాహజలములు భూమిమీదికి వచ్చెను.**

**వచనం 1. ఓడను** నిర్మించమని నోవహుకు ఆజ్ఞ ఇచ్చిన చాలా సంవత్సరాల తరువాత, అతడు **నీతిమంతుడని** దేవుడు చూచెను గనుక **నోవహును** కుటుంబ సమేతంగా ఓడలోనికి ప్రవేశించుమని ఆయన చెప్పెను. ఈ వ్యక్తీకరణ 6:5లో దేవుడు "చూచిన" చెడుతనమునకు, మరియు 6:11లో ఆయన బలాత్కారముతోను మరియు చెడుతనముతో నిండియున్నట్లుగా చూచిన లోకమునకు వ్యత్యాసముగా ఉన్నది. మరియొకసారి, దేవునికి నోవహు "నీతిమంతునిగా" కనిపించెనని ఆయన చెప్పెను. ఇక్కడి ఆలోచన 6:9లోని ఆలోచనతో సమాంతరంగా ఉంటుంది. ఓడను నిర్మించుటలో దేవుని మాటకు నోవహు విధేయుడైనందున అతడు దేవుని దృష్టిలో "నీతి మంతునిగా" ఎంచబడెనని దీని అర్థం కాదు.

**వచనాలు 2, 3. పవిత్ర జంతువులలో ప్రతి జాతి పోతులు ఏడును పెంటులు ఏడును ... ఆకాశ పక్షులలో ప్రతి జాతి మగవి యేడును ఆడువి యేడును ... నీయొద్ద ఉంచుకొనుము** అని దేవుడు నోవహుతో అనెను. పవిత్ర జంతువులు మరియు పక్షులన్నింటిలో "ఏడు ఏడు" చొప్పున ఓడలోనికి తీసుకొనమని దేవుడు నోవహుకు ఆజ్ఞ ఇచ్చినట్లు హెబ్రీ భాష అక్షరార్థంగా చెప్పుచున్నది. ఈ వ్యక్తీకరణ ప్రకారం ప్రతి జాతిలో నుండి ఏడు పవిత్ర జంతువులను ఎన్నుకొనవలెనా లేక పద్నాలుగు ఎన్నుకొనవలెనా అను ప్రశ్న తలెత్తుతుంది. మొదటిగా చూస్తే KJV ప్రతి జాతిలో నుండి ఏడు జంతువులు మరియు పక్షులను సూచిస్తుందని అనిపిస్తుంది, కాని తరువాత అది "పోతులు మరియు పెంటులు" అని తెలియజేస్తుంది. NRSVలో "ఏడు జతల" **పవిత్ర జంతువులు మరియు పక్షులు అని ఉంది** (ESV; NJPSV; REB చూడండి). ఈ రెండవ భావన సరైనది కావచ్చు, ఎందుకనగా "ఏడుగా" అను మాట తరువాత "పోతు మరియు పెంటె" అని వ్రాయబడి అది ప్రతి జాతిలో నుండి ఏడు జతలను సూచిస్తుంది. అపవిత్రమైన జంతువులను కూడ తనతో ఓడలోనికి తీసుకు వెళ్లుమని దేవుడు నోవహుకు చెప్పెను. ప్రతి జాతి యొక్క రెండు లేక "జత"ను (NRSV; ESV; REB) అనగా పోతు మరియు పెంటెలను (6:19 చూడండి) బ్రతికించియుంచవలెను. ఈ సూచనలను పాటించుట ద్వారా, జలప్రళయం తరువాత నోవహు అన్ని జాతులను **బ్రతికించి** ఉంచగలడు.

మోషే ధర్మశాస్త్రము ఇవ్వబడుటకు చాలా కాలం క్రితమే,[1] పవిత్రమైన

మరియు అపవిత్రమైన జంతువులు మరియు పక్షుల మధ్య వ్యత్యాసం చూపబడెను. తరువాతి యూదియ రచయితలు తమ మోషే నియమాలను భూతకాలంలోనికి అమర్చెను అను సలహాను ఇది రుజువుచెయ్యదు. అయితే, బలులు అర్పించుటకు యోగ్యమైన జంతువులు మరియు పక్షులు (పవిత్రమైన) మరియు యోగ్యము కాని (అపవిత్రమైన) వాటి మధ్య దేవుడు భేదాన్ని చాలా ముందుగానే చూపెను అని ఇది వక్కాణిస్తుంది. ఈ నియమములే మోషే ధర్మశాస్త్రములో కూడ చేర్చబడెను (లేవీ. 11:1–47; ద్వితీ. 14:3–20). బలుల వ్యవస్థ నెరవేర్చబడినంత వరకు మరియు సిలువలో యేసు అందరి కొరకు ఒకేసారి చేసిన బలియర్పణ ద్వారా కొట్టివేయుబడునంత వరకు ఆ నియమములు కొనసాగెను (హెబ్రీ. 7:27; 9:12, 28; 10:10).

**వచనం 4.** జలప్రళయాన్ని పంపుతానని దేవుడు మొదటిగా చెప్పిన తరువాత ఆయన ఎంతకాలం వేచియున్నాడనే విషయం బైబిల్ మనకు చెప్పుట లేదు, కాని ఓడను నిర్మించుటకు నోవహుకు సమయమిచ్చి, ఆయన కొన్ని సంవత్సరాలు వేచియుండియుండవచ్చు. 4వ వచనంలో, జలప్రళయానికి ముందున్న ప్రజల పట్ల దేవుని దీర్ఘశాంతమును చూపించే కృపా కాలము సమాప్తమాయెను గనుక దేవుడు త్వరపడుటను వ్యక్తపరచెను. ఎటువంటి ఆలస్యం లేకుండా, **ఏడు దినములకు** ఆయన **భూమిమీద వర్షము కురిపించును. నలుబది పగళ్లును నలుబది రాత్రులును వర్షం కురియును.**[2] **వర్షం ఎంత భయంకరంగా ఉంటుందంటే, దేవుడు చేసిన సమస్త జీవరాసులును భూమిమీద ఉండకుండ తుడిచివేయబడును.**

**వచనం 5.** తనకు **యెహోవా ఆజ్ఞాపించిన ప్రకారము నోవహు యావత్తును చేసెను** అని రచయిత మరొక సారి గట్టిగా చెప్పుచున్నాడు. 6:22లోని ప్రతి మాట పునరావృత్తం అగుట, వివిధ స్థాయిల్లో నోవహు దేవుని ఆజ్ఞలను పాటించెననుటకు ఉదాహరణగా ఉన్నది. ఆశీర్వాదములను అనుభవించాలని ఆశించే దేవుని ప్రజలు ఆయనకు విధేయులగుట తప్పనిసరి అని నేర్చుకొనవలసిన ఇశ్రాయేలీయులకు (మరియు తరువాత క్రైస్తవులకు) అటువంటి ప్రకటన చాలా ప్రాముఖ్యమైనదిగా ఉండెను.

**వచనాలు 6, 7. నోవహును అతనితోకూడ అతని కుమారులును అతని భార్యయు అతని కోడండ్రును ...** ఆ ఓడలో ప్రవేశించిరి—"అనగా ఎనిమిది మంది" (1 పేతురు 3:20 NIV). 7:6 ప్రకారం, జలప్రవాహము ఆరంభమైనప్పటికే **నోవహు ఆరు వందల సంవత్సరముల వయస్సుగలవాడై** యుండెను. ఈ సమాచారమును 5:32లో నోవహు వయస్సును గూర్చి ఇవ్వబడిన మాటతో పోల్చితే, జలప్రళయం సంభవించిన సమయంలో ఆయన కుమారులలో కనీసం ఒకడు వంద యేండ్ల వయస్సు గలవాడని సూచిస్తుంది (10:21; 11:10పై వ్యాఖ్యలను చూడండి). జలప్రళయం తరువాత నోవహు మరొక "మూడువందల

ఏబది" యేండ్లు బ్రతికినప్పటికీ, ఆయనకు ఇంకా పిల్లలు పుట్టినట్లు లేఖనము చెప్పుటలేదు (9:28).

**వచనాలు 8, 9**. 7:2, 3లో **దేవుడు** తనకు ఆజ్ఞాపించినట్లు **నోవహు** చేసెనని, తనతో కూడ **ఓడలోనికి పవిత్ర జంతువులలోను మరియు అపవిత్ర జంతువులలోను, మరియు పక్షులలోను నేలను ప్రాకు వాటన్నిటిలోనుండి తీసుకొనివెళ్ళెనని** ఈ వచనాలు మనకు తెలియజేస్తాయి. జంతువులు మగది ఆడుది జతజతలుగా దేవుని ఆజ్ఞ ప్రకారం ప్రవేశించెను.

ఆదికాండము యొక్క రచయిత వేర్వేరు సోర్సెస్ ఉపయోగించెను గనుక 7:2, 3 మరియు 7:8, 9 మధ్య కొంత విబేధం ఉన్నదని పలు వ్యాఖ్యానకర్తల వాదన. అయితే, ఈ రెండు వచనాల మధ్యలో ఎలాంటి అసమ్మతి లేదు. ఏడు జతల పవిత్ర జంతువులు మరియు ఒక జత అపవిత్ర జంతువులు జలప్రళయం నుండి భద్రపరచబడాలని మొదటి వచనం చెబుతుంది, మరియు పవిత్రమైనవి మరియు అపవిత్రమైనవి జతలుగా ఓడలోనికి ప్రవేశించాలని తరువాతి వచనం చెబుతుంది. 7:8,9లో మరొకసారి ఏడు జతల పవిత్ర జంతువులు అని తెలుపవలసిన అవసరం రచయితకు లేదు.

**వచనం 10. ఏడు దినములైన** తరువాత, దేవుడు ముందుగా చెప్పినట్లు భారీవర్షం ఆరంభమయ్యింది. ప్రవాహజలములు వచ్చుటకు ముందు వారం రోజులు నోవహు కుటుంబం ఏ విధంగా గడిపెను అనుటను గూర్చి చాలా ఊహాగానాలు జరిగాయి. అతని సమాజంలో మారుమనస్సులేని వారికి నోవహు ప్రసంగించుట కొనసాగించెనని కొందరు సూచించారు. బహుశా ఆయన మరియు అతని కుటుంబం నశించిన తమ తరము వారి కొరకు ప్రార్థించుట మరియు అంగలార్చుట కొనసాగించియుండవచ్చు. వారు తమ ముందున్న సుదీర్ఘమైన బసకు అనుకూలంగా ఉండునట్లు ఓడను సిద్ధపరచుచు, ఓడలోని తమ గదిలో ఆ వారమంతా గడిపారని మరొక ప్రతిపాదన తెలుపుతుంది. మొదటిది లేక మొదటి రెండు ప్రతిపాదనలు నిజం కావచ్చు గాని, చివరి ప్రతిపాదన కొట్టివేయబడాలి. ఎందుకంటే, నోవహు మరియు అతని కుటుంబం ఓడలోనికి ప్రవేశించిన రోజున వర్షం ఆరంభమైనదని 12 మరియు 13 వచనాలు సూచిస్తున్నాయి.[3] జలప్రళయానికి ముందు చివరి ఏడు రోజులు వారు ఏమి చేసెనో స్పష్టమైన వివరణ మనకు ఇవ్వబడలేదు. 13వ వచనంలో "ప్రవేశించిరి" అని అనువదించబడిన హెబ్రీ క్రియా పదం (בָּא, *ba'*), వర్షం ఆరంభమైన రోజు కుటుంబం ఓడలోనికి ప్రవేశించు ప్రక్రియను ముగించెను అని సూచిస్తుంది. బహుశా, వారు జంతువులను, పక్షులను, నేలను ప్రాకు వాటిని, తమ తమ గదులలోనికి మరియు గూళ్ళలోనికి నడిపించుచు, వారు ఓడలో ఉన్నంత కాలం అనగా ఒక సంవత్సర కాలానికి పైగా అవసరమైన సరుకులన్నిటిని దానిలో సమకూర్చియుండవచ్చును.

## జలప్రళయం యొక్క ఆరంభం (7:11–16)

**[11]నోవహు వయసుయొక్క ఆరువందల సంవత్సరము రెండవ నెల పదియేడవ దినమున మహాగాధజలముల ఊటలన్నియు ఆ దినమందే విడవబడెను, ఆకాశపు తూములు విప్పబడెను. [12]నలుబది పగళ్లును నలుబది రాత్రులును ప్రచండ వర్షము భూమిమీద కురిసెను. [13]ఆ దినమందే నోవహును నోవహు కుమారులగు షేమును హామును యాపెతును నోవహు భార్యయు వారితోకూడ అతని ముగ్గురు కోడండ్రును ఆ ఓడలో ప్రవేశించిరి. [14]వీరే కాదు; ఆ యా జాతుల ప్రకారము ప్రతి మృగమును, ఆయా జాతుల ప్రకారము ప్రతి పశువును, ఆ యా జాతుల ప్రకారము నేలమీద ప్రాకు ప్రతి పురుగును, ఆ యా జాతుల ప్రకారము ప్రతి పక్షియు, నానావిధములైన రెక్కలుగల ప్రతి పిట్టయు ప్రవేశించెను. [15]జీవాత్మగల సమస్త శరీరులలో రెండేసి రెండేసి ఓడలోనున్న నోవహు నొద్ద ప్రవేశించెను.
[16]ప్రవేశించినవన్నియు దేవుడు అతని కాజ్ఞాపించిన ప్రకారము సమస్త శరీరులలో మగదియు ఆడుదియు ప్రవేశించెను; అప్పుడు యెహోవా ఓడలో అతని మూసివేసెను.**

**వచనం 11.** జలప్రళయంలోని ప్రాముఖ్యమైన సన్నివేశాలకు ఖచ్చితంగా ఈ విధంగా తేదీలు ఇవ్వబడ్డాయి: **జలప్రళయం నోవహు వయసుయొక్క ఆరు వందల సంవత్సరము, రెండవ నెల పదియేడవ దినమున ఆరంభమయ్యింది.** జలప్రళయమును వివరించుటకు ఈ ఖచ్చితమైన తేదీలను ఉపయోగించుట ఈ కథనం యొక్క చారిత్రికతను వాదిస్తుంది. దీనికి భిన్నంగా, మెసొపొతమియ యొక్క జలప్రళయ కథలలో వారి పురాణాలకు చారిత్రక నిర్మాణం లేదు. ఇట్టి ఖచ్చితమైన సమాచారం కలిగియుండి కూడ, "రెండవ నెల" యొక్క తేదిని నిర్ధారించుట కష్టం ఎందుకంటే, యూదులు వారి చరిత్రలో రెండు వేర్వేరు క్యాలెండరులు ఉపయోగించిరి. పౌర (లేక వ్యవసాయ) క్యాలెండరు ప్రకారం, మొదటి నెల ఆకురాలుకాలంలో ఉంటుంది (నిర్గమ. 23:16; 34:22 చూడండి); మత క్యాలెండరు ప్రకారం, మొదటి నెల వసంత కాలంలో వస్తుంది (నిర్గమ. 12:2, 18; ద్వితీ. 16:1, 6).[4] "వెదకాల మును" గూర్చి ఆదికాండము 8:22లోని సూచన, మరియు ఓడ నుండి బయటకు వచ్చిన తరువాత నోవహు "వ్యవసాయము చేయనారంభించి, ద్రాక్ష తోట వేసెను" (9:20) అను విషయం, అతను మరియు అతని కుటుంబ సభ్యులు ఆకురాలుకాలంలో ఓడలోనికి ప్రవేశించి దానిలో నుండి ఒక సంవత్సరం పది రోజుల తరువాత బయటకు వచ్చిరని సూచిస్తాయి (8:14–19).[5]

"నెల పదియేడవ దినమున," భూమి పైనున్న నీరు క్రింద నీటిలో కలువుట ద్వారా వాస్తవిక సృష్టి యొక్క తిరుగుముఖం ఆరంభమైయ్యింది (1:7 చూడండి).

లోకములోని సృష్టిని తుడిచిపెట్టుటలో, మహాగాధజలముల ఊటలన్నియు విడవబడెను. తప్పకుండా, ఈ ప్రక్రియలో భూమిపై ఉన్న నదులు మరియు సెలయేళ్లు మరియు భూగర్భజలాలు (భూమి క్రింద ఉన్న నదులు మరియు సెలయేళ్లు) పాలుపంచుకొన్నాయి.

అంతేగాక, ఆకాశపు తూములు విప్పబడెను. "తూములు" అను పదం אֲרֻבָּה (*ᵃrubbah*) అను పదం నుండి వచ్చెను, "కిటికీ" అని దీని అక్షరార్థం. కొందరు చేసినట్లు ఈ పదమును అక్షరార్థంగా తీసుకొనకూడదు.[6] ఇది కేవలం పురాతన లోకమును నాశనం చేయుటకు ఈ "తూముల" (కిటికీ)[7] ద్వారా వచ్చిన భయంకరమైన మరియు వినాశనకరమైన కుండపోత వర్షమునకు చిత్రాత్మక వర్ణన మాత్రమే. తన ప్రజలపై గొప్ప దీవెనలను కుమ్మరించుటకు దేవుడే ఇట్టి చిత్రాత్మక "కిటికీలు" విప్పుతాడని తరువాత లేఖనములు మనకు తెలియజేయుచున్నవి (2 రాజులు 7:2, 19; మలాకీ 3:10).

**వచనం 12. నలుబది పగళ్లును నలుబది రాత్రులును ప్రచండ వర్షము భూమిమీద కురిసెను.** 7:4లో దేవుడు చేసిన వాగ్దానం నెరవేరెనని ఈ వచనం వ్యక్తపరచుచున్నది. ఒక నెల కంటె ఎక్కువ కాలం కురిసిన వర్షం జలప్రళయం యొక్క భయంకరత్వమును తెలుపుచున్నది.

**వచనం 13. నోవహు** భార్యయు వారితోకూడ అతని ముగ్గురు కోడండ్రకంటే ముందుగా అతని కుమారులైన **షేము, హాము, మరియు యాపెతులను ప్రస్తావించుట** ఈ కథనం యొక్క పితృస్వామ్య దృష్టిని తెలుపుతుంది. నోవహు మరియు అతని కుమారులు ఎల్లప్పుడు నోవహు యొక్క భార్య మరియు అతని కోడండ్రకు ముందుగా పేర్కొనబడిరి (6:18; 7:7, 13; 8:18). ఈ కథనంలోని ఏ స్త్రీ యొక్క పేరు కూడ ఇవ్వబడలేదు: నోవహు భార్యది గాని అతని కోడండ్ర పేర్లు గాని. యోబు యొక్క భార్య వలె (యోబు 2:9, 10), నోవహు భార్య కూడ తన భర్తతో ఉన్న సంబంధం ద్వారానే తెలుపబడెను.

జలప్రళయం ముందు చరిత్రలోని స్త్రీలను గూర్చి మనకు కొంత మాత్రమే తెలిసినప్పటికీ, మనకు కావలసినంత తెలిసియున్నది: లెమెకుతో ఆరంభమై (4:19) జలప్రళయం ముందు వరకు కొనసాగిన (6:5) నైతిక పతనంలో వారు పాలివారు కారు. ఈ నలుగురు కూడ ఏకభర్తృత్వం/పత్నీత్వం కలిగినవారు. నోవహు కుటుంబంలో ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు (1 పేతురు 3:20), మరియు షేతు సంతానములో ఒక భార్య కంటె ఎక్కువ మంది ఉన్న దైవభక్తిగల వ్యక్తి యొక్క మొదటి ప్రస్తావన అబ్రాహాము కథనం వరకు కనిపించదు.

**వచనాలు 14, 15.** 7:6–10లో తాను జతపరచిన దానిని రచయిత మరొకసారి ఆరంభించి దానిని విశదపరచెను: నోవహు మరియు తన కుటుంబం, **ప్రతి మృగమును, ప్రతి పశువును, నేలమీద ప్రాకు ప్రతి పురుగును మరియు ప్రతి పక్షియు ఓడలోనికి** ప్రవేశించుట. అవి **ఓడలోనున్న నోవహు నొద్ద ప్రవేశించెను**

అను మాట కేవలం 7:9ని మాత్రమే గాక 6:19, 20ని కూడ తిరిగి చూపుచున్నవి. నోవహు ఈ జంతువుల కొరకు వెదకవలసిన అవసరం రాలేదు; దేవుడు వాటినే ఆయన యొద్దకు తెచ్చెను. దేవుడు ఏదెను తోటలో జంతువులను ఆదాము యొద్దకు పేర్లు పెట్టుటకు నడిపించిన సన్నివేశమునకు ప్రతిబింబంగా ఉన్నది (2:19). ఈ పరిస్థితిలో, **జీవాత్మ గల సమస్త శరీరులు నోవహు యొద్దకు జతలుగా** ["రెండేసి రెండేసి" NKJV] వచ్చెను. ఈ భాష 6:17లో నుండి పునరావృత్తం అయ్యింది, అక్కడ నాశనమవ్వబోయే వాటి గురించి వివరిస్తూ "జీవాత్మ గల సమస్త శరీరులు" అను మాట ఉపయోగించబడెను. దీనికి భిన్నంగా, ఓడను ఆశ్రయించుట వలన ఈ జీవులు రక్షించబడును.

**వచనం 16**. ఓడలోనికి ప్రవేశించుటకు సంకోచించని మరియు వారి వెనుక దేవుడు ద్వారమును మూసినప్పుడు విభేదించని ఈ ఎనిమిది మంది విశ్వాసులకు అవసరమైన నిర్ణయాత్మక విశ్వాసపు అడుగును వక్కాణించుట కొరకు మరింత సమాచారం జోడించియుండవచ్చు. బయట వచ్చుచున్న పెనుతుఫాను నుండి వారిని ఓడ రక్షించగలదా, లేక **దేవుడు దాని ద్వారమును మూసెను కాబట్టి** అది వారు తప్పించుకొనలేని ఒక సమాధిగా ఉంటుందా? మానవ ఆలోచన ప్రకారమైతే ఈ పని సఫలమౌతుందనే హామీ లేదు; వారి యొద్ద కేవలం దేవుని వాగ్దానం మాత్రమే ఉంది. నిజముగా ఇది మునుపెన్నడూ ఎవ్వరు చూడనంత నీరు కాబట్టి, నోవహు మరియు ఆయన కుటుంబం ఓడలోనికి ప్రవేశించినప్పుడు మరియు వారి వెనుక దేవుడు ద్వారము మూసినప్పుడు దేవుని హస్తములకు తమ్మును తాము సమర్పించుకొనగలిగిన గొప్ప విశ్వాసం వారికి అవసరమెయ్యింది (హెబ్రీ. 11:7).

## నీటిమట్టం పెరుగుట మరియు పర్వతములు మునుగుట (7:17–24)

**17ఆ జలప్రవాహము నలుబది దినములు భూమిమీద నుండగా, జలములు విస్తరించి ఓడను తేలచేసినందున అది భూమిమీదనుండి పైకి లేచెను. 18జలములు భూమిమీద ప్రచండముగా ప్రబలి మిక్కిలి విస్తరించినప్పుడు ఓడ నీళ్ళమీద నడిచెను. 19ఆ ప్రచండ జలములు భూమిమీద అత్యధికముగా ప్రబలినందున ఆకాశమంతటి క్రిందనున్న గొప్ప పర్వతములన్నియు మునిగిపోయెను. 20పదిహేను మూరల యెత్తున నీళ్లు ప్రచండముగా ప్రబలెను గనుక పర్వతములును మునిగిపోయెను. 21అప్పుడు పక్షులేమి పశువులేమి మృగములేమి భూమిమీద ప్రాకు పురుగులేమి భూమిమీద సంచరించు సమస్త శరీరులేమి సమస్త నరులేమి చచ్చిపోయిరి. 22పొడి నేలమీదనున్న వాటన్నిటిలోను**

**నాసికారంధ్రములలో జీవాత్మ సంబంధమైన ఊపిరిగలవన్నియు చనిపోయెను. [23]నరులతో కూడ పశువులును పురుగులును ఆకాశపక్షులును నేలమీదనున్న జీవరాసులన్నియు తుడిచివేయబడెను. అవి భూమిమీద నుండకుండ తుడిచివేయబడెను. నోవహును అతనితోకూడ ఆ ఓడలో నున్నవియు మాత్రము మిగిలియుండెను. [24]నూట ఏబది దినముల వరకు నీళ్లు భూమిమీద ప్రచండముగా ప్రబలెను.**

**వచనం 17. జలప్రవాహము నలుబది దినములు భూమిమీద ఉండెను** అను మాట నలుబది దినములు మరియు రాత్రులు వర్షము కురిసెను అని చెప్పిన 7:12కు సమాంతరంగా ఉంది. ధారాళమైన వర్షం **నీటి మట్టమును పెంచి, ఓడను భూమిమీద నుండి పైకి లేపెను**. వర్షం ఆగిన తరువాత కూడ, భూగర్భజలాల వలన మరియు మంచుకొండలు కరుగుట వలన నీటి మట్టం పెరిగెను.

**వచనాలు 18–20**. అంతేగాక, జలములు మూడు వేర్వేరు విధాలుగా విస్తరించెను అని లేఖనం చెబుతుంది. (1) **ఓడ నీళ్ళమీద నడచునంతగా అవి విస్తరించెను** (7:18). (2) **జలములు అత్యధికముగా ప్రబలినందున, ఆకాశమంతటి క్రిందనున్న గొప్ప పర్వతములన్నియు మునిగిపోయెను** (7:19). (3) **పర్వతములు మునుగునట్లుగా అది పదిహేను మూరల** యెత్తున ప్రబలెను (7:20).

7:18–20లో "ప్రబలెను" అని అనువదించబడిన పదం גָּבַר (*gabar*), యొక్క అర్థం "బలముగా ఉండుట."[8] ఇది ఎక్కువగా శత్రువులతో జీవన్మరణ పోరాటాలలో పాలుపంచుకొను బలమైన యోధుల కొరకు, గొప్ప కార్యములు చేసిన దావీదు "యోధుల" వంటివారి కొరకు ఉపయోగించబడెను (2 సమూ. 23:8–39; 1 దిన. 11:26–47). హెబ్రీయుల ఆలోచన ప్రకారం, యెహోవా నిజమైన "రాజులకు ప్రభువు" (దాని. 2:47), మరియు ఆయన ఎర్ర సముద్రము యొద్ద ఫరో సైన్యమును జయించినప్పుడు గొప్ప యోధుడైన రాజుగా ఘోషించబడెను (నిర్గమ. 15:1–18). ఈ విధంగా, విమోచించబడిన ప్రజలైన ఇశ్రాయేలును సృష్టించుట ద్వారా దేవుడు తన "శక్తిని" కనబరచెను (కీర్తనలు 106:8; 145:4, 11, 12). ఆయన గొప్ప శక్తి కార్యములు (*gabar*) ఆయన చేసిన మహోన్నతమైన సృష్టియందు మరియు జగత్తును, లోకమును, మరియు దానిలోని సమస్త జీవులను ఆయన స్వాధీనపరచుకొనుటయందు వ్యక్తపరచబడెను (కీర్తనలు 65:5–13; 89:9–13).

దేవుడు వాస్తవిక సృష్టిలో, "అగాధమును" కప్పియున్న నీటిని వేరుపరచి కొంత నీటిని "విశాలత"పై లేక ఆకాశములో ఉంచి తద్వారా ఆరిన నేల కలుగున్నట్లు మరియు భూమిపై జీవనం ఆరంభమగునట్లు చేసెనని ఆదికాండము బయలుపరుసస్తుంది (1:2–9). మహా జలప్రళయం వచ్చిన సమయంలో,

పైనున్న నీరు మరొకసారి భూమిపై ఉన్న జీవులన్నిటిపై యుద్ధము చేయుటకు చెరసాల నుండి బయటకు వచ్చిన బలమైన చిత్రాత్మక యోధుల వలె క్రింద ఉన్న నీటితో కలిసెను. దేవుడు చేసిన ఈ మహా కార్యము సృష్టిని తలక్రిందులుగా చేసి, ఓడలో దైవిక ఆశ్రయము పొందిన వారు మినహా మానవులందరికీ, జంతువులకు, పక్షులకు, ప్రాకువాటికి మరణమును సంప్రాప్తింప జేసెను.

**వచనాలు 21–24**. జలప్రళయమునకు సంబంధించి ఉపయోగించబడిన పదాలు ఈ వృత్తాంతములో స్పష్టమైన సార్వత్రికతను కలిగియున్నవి: "ఆకాశమంతటి క్రిందనున్న గొప్ప పర్వతములన్నియు మునిగిపోయెను" (7:19), మరియు **భూమిమీద సంచరించు సమస్త శరీరులేమి సమస్త నరులేమి చచ్చిపోయిరి** (7:21). దీనిలో నేలమీదనున్న **వాటన్నిటిలోను నాసికారంధ్రములలో జీవాత్మ సంబంధమైన ఊపిరిగలవన్నియు మిళితమై యున్నవి** (7:22). గొప్ప జలప్రళయం **వలన నేలమీదనున్న జీవరాసులన్నియు తుడిచివేయబడెను. నోవహును అతనితోకూడ ఆ ఓడలో నున్నవియు మాత్రము మిగిలియుండెను అని** వాక్యభాగము నిర్ధారించుచున్నది (7:23). నూట ఏబది దినముల వరకు నీళ్లు భూమిమీద ప్రచండముగా ప్రబలెను అని చెప్పుచు అధ్యాయం ముగించబడెను (7:24).

ఈ వచనములను సూటిగా చదివిన యెడల, సార్వత్రిక (ప్రపంచ వ్యాప్తమైన) జలప్రళయం పర్వతములన్నిటిని కప్పి ఓడలో ఉన్నవారు మినహా అందరిని హతము చేసెనని అంగీకరించునట్లు చేస్తుంది కాని, ఇది కేవలం ప్రాచీన మెసొపొతమియకు పరిమితమైన జలప్రళయం అని కొందరు వాదిస్తారు. భూగర్భశాస్త్ర మరియు పురావస్తుశాస్త్ర రుజువులు సార్వత్రిక విపత్తును బలపరచవని వారి వాదన. వైజ్ఞానిక సమాజంలో ప్రపంచ సృష్టిని, జంతువుల మరియు మనుష్యుని సృష్టిని ఖండిస్తూ ఇలాంటి వాదములే జరిగెను. జలప్రళయమును గూర్చి ఏది వైజ్ఞానికముగా రుజువుచేయబడగలదు మరియు ఏది చేయబడలేదు అని చర్చించుట ఈ వ్యాఖ్యానం యొక్క పరిమితులకు వెలుపటి విషయం, కాని ప్రాచీన సంఘటనలను పరీక్షించు మరియు వాటిని నిరాకరించు సామర్థ్యం విజ్ఞానశాస్త్రమునకు లేదని గుర్తించుట చాలా అవసరము.[9]

వాక్యభాగమును తనకు తానుగా మాట్లాడనివ్వాలి. ప్రపంచవ్యాప్తమైన జలప్రళయమును సమర్థించునవి మరియు దానికి విరోధముగా వాదించుటకు ఉపయోగించబడినవియైన లేఖనభాగములను పరిశీలించుట మనకు సహాయపడవచ్చు.[10] కడపటి ఆలోచనను గూర్చి చెప్పాలంటే, లోకమంతటి గురించి సంబోధించుటకు ఉపయోగపడు హెబ్రీ పదము (תֵּבֵל, *thebel*; యోబు 34:13 చూడండి), ఈ వృత్తాంతములో కనిపించదు. ఈ వాక్యభాగంలో אֶרֶץ (*'erets*) అను పదం వాడబడెను, మరియు ఇది "భూమి" అని అనువదించబడెను. *'erets* అను పదం కనాను (12:1–10లో ఎనిమిది సార్లు)

“దేశం” వంటి చిన్న ప్రాంతములని లేక ఇతర స్థానిక ప్రాంతములని అర్థమిచ్చునది నిజమైనపటికీ (2:11–13; 4:16; 10:10; 11:2), 1:1, 2 మరియు 2:4లో ఇది భూమి అంతటికి ఉపయోగించబడెను. సృష్టి వృత్తాంతములో ఈ వాక్యం కనిపిస్తుంది కనుక, జలప్రళయం ద్వారా దేవుడు సృష్టిని తలక్రిందులు చేసిన వృత్తాంతములో కూడ అది తార్కికంగా వ్యాఖ్యానించబడెను.

ఈ వాక్యభాగం నుండి వెలువడిన మరొక వాదము כֹּל (*kol*) అను హెబ్రీ పదము యొక్క ఉపయోగమునకు సంబంధించినది, మరియు ఇది “అందరు,” “ప్రతి ఒక్క,” లేక “ప్రతిచోట” అని జలప్రళయ వృత్తాంతములోని ఈ భాగములో ఎనిమిది సార్లు అనువదించబడెను (7:19–23). కొన్ని సార్లు రచయిత స్థానిక కోణములో ఉపయోగించుట వలన దీనిలో సార్వత్రిక భావము ఉండదు (41:57; ద్వితీ. 2:25). క్రొత్త నిబంధన πᾶς (*pas*, “అందరు” లేక “ప్రతి ఒక్కరు”) అను గ్రీకు పదమును ఇదే విధంగా ఉపయోగిస్తుంది (అపో. 2:5; కొలస్సీ. 1:23). ఏదేమైనా, ఇట్టి తర్కము సమర్థించతగినది కాదు. 1:21, 26లోని సృష్టి కథనంలో *kol* అను పదము యొక్క సార్వత్రిక భావము తప్పనిసరిగా కనిపిస్తుంది, మరియు సృష్టిన నాశనం చేయబడుటలో కూడ దానిలో అదే అర్థం కలిగియున్నదని అనిపిస్తుంది (7:19–23). లేఖన భాగమును ఖచ్చితమైన దృష్టితో చూచినప్పుడు, సార్వత్రిక జలప్రళయంగా దీనిని చూచుట సరైనది.

## అన్వయము

### మారుమనస్సు పొంద అవకాశం ఇచ్చుటకు దేవుని ఆలస్యం

### (అధ్యాయం 7)

రానున్న జలప్రళయమును గూర్చి దేవుడు మొదటిగా నోవహును హెచ్చరించిన దినము మొదలుకొని తన కుటుంబమును లోపల ఉంచి ద్వారమును మూయుట మరియు వర్షం ఆరంభమగుటకు మధ్య ఎంతకాలమున్నదో మనకు తెలియదు. ఈ రెండు సన్నివేశాల మధ్యలో అనేక దశాబ్దాలు గడచియుండవచ్చు. కాల పరిమితి ఎంతైనప్పటికీ, ఈ నమ్మకమైన శేషము రానున్న తీర్పును గూర్చి ఇతరులను హెచ్చరించుట, ఓడను నిర్మించుట, మరియు వారు జల ప్రవాహములపై ఒక సంవత్సరం జీవించుటకు కావలసిన నిత్యవసర వస్తువులను సమకూర్చుకొనుట వారికి చాలా సుదీర్ఘముగాను అలసటగాను ఉండియుండవచ్చు.

దేవుని తీర్పులోని ఆలస్యం ఎల్లప్పుడు దేవుని దాసులకు సమస్యలను కొనితెచ్చెను. దేవుని యొక్క తీర్పు “ఉత్తర దిక్కు నుండి” వస్తుందని యిర్మీయా యూదా ప్రజలకు నలభై సంవత్సరాలు ప్రసంగించి, వేడుకొని, వారిని

హెచ్చరించాడు (బబులోను నుండి; యిర్మీయా 1:13; 4:6; 6:22; 10:22; 13:20; 25:9). పాపము వలన దావీదు వంశము పట్ల దేవుని శిక్ష వారి రాజ్యము పతనమగుట మరియు ప్రజలు బానిసత్వములోనికి వెళ్లుట అను రూపంలో వచ్చుచున్నది. ఇదిగో "నలుదిక్కుల భయము" వచ్చుచున్నది (యిర్మీయా 20:10 చూడండి) అని ప్రజలు ఆయనను హేళన చేయునంత వరకు "నలుదిక్కుల భయము తగులుచున్నది" (యిర్మీయా 6:25; 46:5) అని ప్రవక్త మరలా మరలా ప్రకటించెను.

తరచుగా, ఆలస్యమైన తీర్పు తిరస్కరించిన తీర్పుతో సమానం; ప్రజలు తాము చూసిన దానిని మాత్రమే నమ్మే గుణము కలిగియుంటారు. నోవహు దినములలో వలెనె, క్రీస్తు యొక్క రెండవ రాకడలో కూడ జరుగును అని క్రొత్త నిబంధన బోధించుచున్నది (మత్తయి 24:37–39). "ఆయన రాకడను గూర్చిన వాగ్దాన మేమాయెను?" అని హేళనచేయువారు అందురు. ఎటువంటి ఆటంకం లేకుండా చాలా కాలంగా ప్రపంచం కొనసాగుచున్నందున కడవరి దినములలో రాన్నున తీర్పును గూర్చి విని వారు హేళన చేస్తారు (2 పేతురు 3:3, 4). అట్టి హేళన చేయువారు నోవహు దినములలో వచ్చిన జలప్రళయమును మరుతురని పేతురు చెప్పుచున్నాడు (2 పేతురు 3:5–7). అంతేగాక, తీర్పు ఆలస్యం అగుటకు కారణం దేవుని సహనం మాత్రమేనని ఆయన వక్కాణించుచున్నాడు: ఆయన "యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని" కోరుచున్నాడు (2 పేతురు 3:9). జలప్రళయానికి ముందు కూడ ఇలానే జరిగింది, "దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా ... ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణ పొందిరి" (1 పేతురు 3:20). దేవుడు కృపతో తీర్పును ఆలస్యం చేయగా, లోకములోని అనేక మంది ఆత్మీయ మాంద్యమునకు ప్రలోభపెట్టబడిరి. ప్రజలు నోవహు యొక్క ప్రసంగమును వినలేదు కాబట్టి (2 పేతురు 2:5), భూమిపై వచ్చిన నాశనకరమైన జలప్రళయంలో నశించిరి.

## జీవములోనికి దేవుని ఆహ్వానం (అధ్యాయం 7)

జలప్రళయం నుండి రక్షించబడునట్లు నోవహును మరియు అతని కుటుంబమును ఓడలోనికి ఆహ్వానించుట ద్వారా (7:1, 13) దేవుడు తన రక్షణ కార్యములో చొరవ తీసుకొనెను. నాశనం రాబోతుందని మరియు వారికి దేవుడు విమోచన మార్గాన్ని అనుగ్రహిస్తాడని చెప్పబడిన సువార్తను ("శుభవార్త") ఈ కుటుంబం అంగీకరించెను. భూమిపైకి పంపబోవుచున్న నాశనం నుండి తన ప్రజల శేషమును కాపాడుతానని దేవుడు చేసిన వాగ్దానం ఈ సువార్త సందేశమునకు అర్థమై ఉంది. అపాయం లేనియెడల, రక్షణ – అనగా, మరణము (తీర్పు) నుండి దాగియున్న విమోచన ఉండేదికాదు. ఈ రక్షణను అంగీకరించుటకు లేక

నిరాకరించుటకు ప్రతి వ్యక్తికి స్వేచ్ఛాచిత్తం కలదు.

జీవములోనికి దేవుని ఆహ్వానం మోషే (ద్వితీ. 30:19, 20), ప్రవక్తలు (యెష. 52:1—12; 55:1—13; 60:1—14; యిర్మీయా 3:14—4:4; 6:16; 18:1—12; 31:21—34; మరియు ఇతరులు), మరియు ముఖ్యంగా క్రీస్తు ద్వారా తరువాత దేవుడిచ్చిన ఆహ్వానాలకు పూర్వగామిగా ఉంది. విశ్వాసము కలిగి విధేయతను చూపించుటకు ప్రజలను యేసు పిలచెను: (1) ఆయనయందు విశ్రాంతి పొందుటకు (మత్తయి 11:28—30); (2) తాను తరువాత పంపబోవుచున్న పరిశుద్ధాత్మ ద్వారా "జీవజలం" (నిత్యజీవం) త్రాగుటకు (యోహాను 4:10—15; 7:37—39); (3) తమ హృదయపు తలుపు ఆయన కొరకు తెరచినయెడల ఆయనతో కూడ భోజనము చేయుటకు (ప్రకటన 3:20); మరియు (4) "దేవుని సింహాసనం" నుండి వచ్చు "జీవజలములను" త్రాగుటకు (ప్రకటన 22:1). ఈ ఆహ్వానం అందరు అంగీకరించాలని (విమోచింపబడిన) "ఆత్మ మరియు వధువు" హెచ్చరిస్తుంది (ప్రకటన 22:17).

నోవహు మరియు ఆయన కుటుంబము రక్షించబడుటకు మరియు యేసు యొక్క పిలుపునకు స్పందించు ప్రజలు రక్షించబడుటకు మధ్య పేతురు ఒక పోలికను చూసెను. రక్షణ పొందగోరువారు ఆయన పునరుత్థానము పట్ల విశ్వాసముతో స్పందించి, క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటకు విధేయత చూపించాలి (1 పేతురు 3:20, 21; రోమా. 6:3—5 చూడండి). యేసు మన కొరకు మరణించెను గనుక, మనలను తీర్పులో నుండి సురక్షితంగా మోసుకొనివెళ్తూ, ఆయన మన యెడల ఆత్మీయ ఓడ వలె ఉన్నాడు. జలప్రళయం తరువాత ప్రతి విధమైన దుష్టత్వము నుండి శుద్ధిచేయబడిన లోకంలోనికి వచ్చిన ఎనిమిది మంది వలె రక్షించబడి నవారు నూతన సృష్టిలో భాగమైయున్నారు (2 కొరింథీ. 5:17)

ఓడలోనికి ప్రవేశించమని ఇవ్వబడిన ఆజ్ఞను అంగీకరించుట చాలా కష్టం. అట్టి జలప్రళయం నిజంగా వస్తుందని తెలుపుటకు కావలసిన రుజువేది లోకములో అప్పటికి లేదు. అలాంటిది ఉన్నప్పటికీ, అది నిజానికి భూమిపై జీవమును నాశనం చేస్తుందని చూపుటకు అంగీకరింపదగిన రుజువు లేదు. పొరుగు వారికి, మిత్రులకు, మరియు ఇతర కుటుంబ సభ్యులకు చెప్పుటకు దేవుని మాట తప్ప నోవహు మరియు అతని కుటుంబమునకు మరి ఏమియు లేదు. దేవుని మాటను నమ్ముటకు "అదృశ్యమైనవాటి"పై—"అదివరకు చూడని సంగతులనుగూర్చి" విశ్వాసముంచుట తప్పనిసరి (హెబ్రీ. 11:1, 7). ఇట్టి విశ్వాసం దేవుడు "ఉన్నాడని" మాత్రమే కాకుండ, "తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడని" నమ్ముతుంది (హెబ్రీ. 11:6).

సాధారణ రీతిలో కొనసాగుచున్న లోకమును విడిచిపెట్టి దేవుని ఆజ్ఞకు విధేయులవ్వాలంటే కొంత కష్టమే. విధేయులైన వారు స్వంతగా తాయారు

చేసుకున్న ఓడలో అత్యంత కొరత కలిగిన పరిస్థితులలో ఉండిపోవలసి వచ్చింది. ఇహలోక సంపదలు, ఇళ్లు మరియు స్థలాలు, స్నేహితులు మరియు ఇతర కుటుంబ సభ్యులను విడచిపెట్టవలసి వచ్చింది. నోవహు మరియు తన కుటుంబం ప్రయత్నించినప్పటికీ, ఓడలోనికి తమతో కూడ వెళ్లుటకు ఒక్కరిని కూడ ఒప్పించలేకపోయిరి. అనగా వారు తమ జీవితంలో అనుభవించినవి మరియు యెరిగినవన్నియు ఎన్నటికి ఉండకుండా నాశనమగును. వారి భవిష్యత్తు ఎలా ఉంటుంది? వారు ఎలాంటి జీవితం జీవిస్తారు? వారికి తెలిసిన లోకమునకు వేరుగా ఉన్న లోకములో జీవితాన్ని క్రొత్తగా ఆరంభించుట యోగ్యమైన పనేనా? విశ్వాసముతో ఓడలోనికి ప్రవేశించుచుండగా ఇటువంటి ప్రశ్నలు చాలా వారి మనస్సులలో నిండియుండవచ్చు.

## దేవుని యందు నోవహు విశ్వాసం (7:1)

నోవహు యొక్క విశ్వాసం అదృశ్యమైన వాటిని చూచుటకు ఆయనకు సహాయపడెనని హెబ్రీ పత్రిక రచయిత వక్కాణించుచున్నాడు:

> విశ్వాసమునుబట్టి నోవహు అదివరకు చూడని సంగతులనుగూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై, తన యింటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధముచేసెను; అందువలన అతడు లోకముమీద నేరస్థాపనచేసి విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసుడాయెను (హెబ్రీ. 11:7).

రానున్న జలప్రళయం విశ్వాసం ద్వారా నోవహు జీవితంలో ఎంత వాస్తవమయ్యిందంటే, పాపము నుండి దేవుని తట్టు తిరుగుమని ప్రజలను బ్రతిమాలుకొనుటకు ఎటువంటి త్యాగమైనా చేయుటకు ఆయన ఇష్టపడెను. ఆ కాలమంతా ఆయన ఓడను నిర్మిస్తూనే ఉన్నాడు—బహుశా తన సందేశమును తిరస్కరించిన వారి హేళన మరియు వ్యతిరేకత మధ్యలో కావచ్చు (1 పేతురు 3:20 చూడండి).

నీతి అనునది తన మంచి క్రియల వలన నోవహు పొందుకున్నదో లేక అతనికి ఆపాదించబడినదో కాదు. అది దేవుని పట్ల ఆయనకున్న విశ్వాసమునకు ప్రతిఫలము (తరువాత అబ్రాహాము వలె; 15:6; రోమా. 4:1–3). నోవహు తన రక్షణ కొరకు సొంత క్రియలు మరియు శక్తిపై ఆధారపడక, దేవునిపై నమ్మికయుంచి (విశ్వాసం కలిగి) ఆయన సంరక్షణకు మరియు కాపుదలకు తన్ను తాను అప్పగించుకొనినట్లు దేవుడు అతనిని కనుగొనెను. ఓడ నిర్మించుటలో నోవహు చూపిన విధేయత స్వాభావికంగా దేవుని కృపపై ఆధారపడియున్న అతని విశ్వాస యాత్ర నుండి వెలువడినది (6:8, 9). కాబట్టి, దేవుడు అతనిని "నీతిపరునిగా" చూచెను (ఎంచెను).

## ఓడ నిర్మాణం యొక్క కాల వ్యవధి (7:6)

ఓడ నిర్మించుటకు నోవహుకు ఎంత సమయం పట్టింది అను ప్రశ్నకు ఆదికాండం 5:32 మరియు 7:6కు కొంత సంబధం ఉంది. ఈ లేఖనభాగాలను పట్టించుకోకుండా కొందరు 6:3 ఆధారంగా 120 సంవత్సరాలు పట్టిందని నిర్ధారించారు. ఏదేమైనా, ఆ లేఖనభాగంలో దేవుడు కేవలం లోకమును నాశనం చేయుటకు ముందు అనుగ్రహించిన కృపా కాలమును గూర్చి మాత్రమే తెలిపెను. ఓడ నిర్మించుట గూర్చి ఆ వచనం ఏమియు తెలుపుట లేదు. అంతేగాక, దేవుని మాటలు ఏదైనా ఒక ప్రత్యేకమైన వ్యక్తిని సూచించలేదు. బహుశా, నోవహుకు బయలుపరచుటకు అనేక సంవత్సరముల మునుపే భూమిని నాశనం చెయ్యాలని దేవుడు నిర్ణయించెను.

ఓడను నిర్మించుటకు దేవుడు నోవహుకు సూచనలు ఇచ్చినప్పుడు, అతనితో ఒక నిబంధన స్థాపిస్తానని దేవుడు వాగ్దానము చేసెను; మరియు నోవహు తన భార్య, కుమారులు, మరియు అతని కోడండ్రతో కలసి ఓడలోనికి ప్రవేశించవలెను (6:18). తన మొదటి కుమారుని యొక్క జననమునకు ఇరవై సంవత్సరాల ముందే దేవుడు నోవహుతో మాట్లాడెను అని ఊహించుట ద్వారానే 120 సంవత్సరాల కాల వ్యవధిని మనము నిర్ధారించగలము. ఏదేమైనా, దేవుడు నోవహుతో మాట్లాడినప్పుడు తన ముగ్గురు కుమారులైన షేము, హాము, యాపెతులు జన్మించి, ఎదిగి, వివాహములు కూడ చేసుకొనిరని అంగీకరించుట మరింత సహజంగా అనిపిస్తుంది.

నోవహు మొదటి కుమారుడు అతనికి 500 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు జన్మించెను (5:32). అతని ముగ్గురు కుమారులలోని ఒక్కొక్కరి జననం మధ్య కొన్ని సంవత్సరాల వ్యవధి ఉండి (10:21; 11:10 చూడండి), వారి వివాహాలు జరుగుటకు మరొక ఇరవై సంవత్సరాలు పట్టినచో, దేవుడు నోవహుతో మాట్లాడినప్పటికి అతనికి కనీసం 525 సంవత్సరాల వయస్సు ఉండాలి. నోవహుకు 600 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు భూమిపై జలప్రళయం వచ్చిందని లేఖనభాగం చెబుతుంది (7:6). అనగా ఓడను నిర్మించుటకు నోవహు మరియు అతని కుమారులకు సుమారుగా 75 సంవత్సరాల సమయం ఉన్నది. ఏదేమైనా, ఓడను నిర్మించుటకు పట్టిన కాలం మాత్రం దాని కంటె తక్కువే కావచ్చు.

---

సూచనలు

[1]ధర్మశాస్త్రము ఇవ్వబడుటకు మునుపు కూడ సున్నతి ప్రాముఖ్యమైనది అని ఆదికాండము 17:9–14 తెలియజేస్తుంది. ఇది మోషే కాలం నుండి మాత్రమే గాక,

అబ్రాహాము కాలము నుండే దేవుని యొక్క నిబంధన జనులకు చిహ్నం. [2]ఆదికాండము 4:4 మొదలుకొని, బైబిలులో “నలభై” ఒక ప్రాముఖ్యమైన సంఖ్యగా ఉంది (నిర్గమ. 16:35; 24:18; 34:28; సంఖ్యా. 13:25; 32:13; న్యాయాధి. 3:11; 5:31; 8:28; 2 సమూ. 5:4; 1 రాజులు 11:42; 19:8; మత్తయి 4:2; అపొ. 1:3; 7:23, 30, 36; 13:21 చూడండి). [3]మత్తయి 24:37–39 నోవహు మరియు తన కుటుంబం ఓడలోనికి ప్రవేశించుటకు ముందటి కాలంలో ప్రజలు ఏమి చేస్తున్నారో వివరిస్తుంది. యేసు ముందు చెప్పిన మాటకు తోడుగా, ఈ కాలంలో జరిగిన విషయాలను గూర్చి అనేక ఊహలు యూదా సాహిత్యంలో పుట్టుకొచ్చాయి. (Kenneth A. Mathews, *Genesis 1–11:26*, The New American Commentary, vol. 1A [Nashville: Broadman & Holman Publishers, 1996], 374.) [4]“The Jewish Calendar” in Coy D. Roper, *Exodus*, Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2008), 187 చూడండి. [5]ఈ వాక్యభాగములోని సంవత్సరాన్ని చంద్రమానం ప్రకారం కొలిస్తే (354 రోజులు), ఓడలో నోవహు ఉన్న సమయం (ఒక సంవత్సరం మరియు పదకొండు రోజులు) సౌర సంవత్సరంతో సమానంగా ఉంటుంది (365 రోజులు). (John H. Walton, Victor H. Matthews, and Mark W. Chavalas, *The IVP Bible Background Commentary: Old Testament* [Downers Grove, Ill.: Inter-Varsity Press, 2000], 38.) [6]ఉదాహరణకు, “తూములు” విప్పబడి ఆకాశపు నీరు కుమ్మరించబడినంత వరకు ఒక “బలమైన గోపురం” దానిని ఆపెను అను ప్రాచీన వ్యక్తుల ఆలోచనను John E. Hartley చెప్పుచున్నాడు (John E. Hartley, *Genesis*, New International Biblical Commentary [Peabody, Mass.: Hendrickson Publishers, 2000], 45, 103). [7]Victor P. Hamilton, “אֲרֻבָּה” in *TWOT*, 1:68. [8]H. Kosmala, “גָּבַר” in *Theological Dictionary of the Old Testament*, trans. John T. Willis, ed. G. Johannes Botterweck and Helmer Ringgren (Grand Rapids: Wm. B. Eerdmans Publishing Co., 1975), 2:367–69. [9]చేప శిలాజాలు ప్రపంచమంతటా ఎత్తైన పర్వతాలపై కనిపించాయి అను విషయం గమనించాలి. ఇది సార్వత్రిక జలప్రళయం తరువాత మాత్రమే సాధ్యమని మనం అర్థంచేసికొనగలం. [10]John H. Walton, *Chronological and Background Charts of the Old Testament*, rev. and exp. (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1994), 100–101 చూడండి.